క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గుడుపల్లి గ్రామంలో వినాయకుడు, శివలింగం, హనుమాన్, నవగ్రహ ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించింది. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాండు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమ నాయకుడు మృతి



రామారావు జోషి (ఫైల్)

అనంతగిరి: తెలంగాణ ఉద్యమ నాయకుడు రామారావు జోషి పంతులు (67)అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈయన వికారాబాద్‌లో జరిగిన రాష్ట్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. టీజేఏసీ వికారాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా, వీడీఎఫ్ ఫౌండర్ మెంబర్‌గా పనిచేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బుధవారం ఉదయం పంతులు పార్థివదేహానికి నివాళి అర్పించారు. ఆయనతో పాటు బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యావేత్తలు నివాళి అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఆర్థిక సాయం

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని పార్టీ బండవెల్కిచర్ల గ్రామ నేతలు లక్ష్మారెడ్డి, గోవర్ధన్ రెడ్డిలు అన్నారు. బుధవారం బండవెల్కిచర్లకు చెందిన ఎల్లమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందగా.. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి స్థానిక నేతల ద్వారా బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయంగా అందజేశారు.

దోమలో..

దోమ: నిరుపేదలను ఆదుకుంటామని అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకుడు అంజిరావన్ అన్నారు. బుధవారం గుండాల గ్రామంలో ఇస్తమ్మ అనే మహిళ మృతి చెందగా.. అంజిరావన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

అకాల వర్షంతో తప్పని తిప్పలు

కుల్కచర్ల: అకాల వర్షం రైతులను భయాందోళనకు గురిచేసింది. కుల్కచర్ల, సాల్వీడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొంతమేర తడిసింది. కల్లాల వద్ద ఉన్న ధాన్యాన్ని అధికారులు సేకరించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. వర్షంతో పాటు వీచిన గాలులకు మండల కేంద్రంలో బీసీ వసతిగృహంలోని చెట్టు విరిగిపడి పక్కనే ఉన్న శ్రీను అనే వ్యక్తి ఇంటిపై పడింది. దీంతో ఇంటి పై కప్పు రేకులు కుంగిపోయాయి.

ఘనంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



జేసీబీతో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

బొంరాస్‌పేట: నాందార్‌పూర్‌లో బుధవారం విగ్రహం, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం బోనాలతో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుధాలపల్లి ఆంజనేయస్వామి నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా మూడోరోజు ధ్వజస్తంభం ప్రతిష్ఠించగా.. గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది.

రాజ్యాంగ ధర్మాన్ని కాపాడుకుందాం

పరిగి: రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ అగ్రవర్ణాల చేతుల్లోనే ఉన్నాయని, దళిత బహుజనులను రాజకీయంగా ఎదగనీయకుండా.. అణగదొక్కుతున్నారని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ ఆరోపించారు. బుధవారం ఆయన జాపర్‌పల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగ ధర్మాన్ని కాపాడుకోవడం కోసమే పార్టీ అవతరించిందని చెప్పారు. రాష్ట్రంలో 90శాతం ఉన్న బీసీ,ఎస్సీ,ఎస్టీలు అగ్రవర్ణాల చేతిలో నష్టపోతున్నారని, అందుకే బహుజన రాజ్యం తీసుకువచ్చేందుకు డీఎస్‌పీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రాజుమహరాజ్, శ్రావణ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దం గడిచినా దశ మారలే!

- పూర్తికాని వసతి గృహ నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పెద్దేముల్: వసతి గృహ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి దశాబ్ద కాలం గడిచినా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే నన్న చందంగా.. పిల్లర్లు, స్లాబ్ వేసి వదిలేశారు. గోట్లపల్లి గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాల మోడల్ స్కూల్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల కోసం వసతిగృహం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2012 ఆగస్టు 30న సీఎస్‌ఎస్ గ్రాంట్ కింద రూ.128.82 లక్షల నిధులు మంజూరు చేయగా.. భవన నిర్మాణం కోసం ప్రస్తుత విద్యాశాఖ (నాడు హోం) మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. సుమారు పదేళ్లు దాటినా దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆదర్శ పాఠశాలలో తట్టెపల్లి, ఇందూరు, అడ్కిచెర్ల, బండమీదిపల్లి, అంతారం, గాజీపూర్, జైరాంతండా, ఓంలానాయక్ తండాతో పాటు పలు గ్రామాల విద్యార్థులు చదువుకుంటున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు కొనసాగుతుంది. కానీ వసతులు లేక స్టూడెంట్స్ ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెప్పడమే తప్ప.. పదేళ్ల నుంచి వసతి గృహం పనులు మధ్యలో నిలిచిపోయి, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తిచేయించి, వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిలిచిన ఆదర్శ పాఠశాల వసతి గృహం (ఫైల్)



మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

కళ్యాణలక్ష్మి పేదలకు వరం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: కళ్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు వరం అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 58 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా అమలు కాని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనురాధ, జెడ్పీటీసీ ధారాసింగ్, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ చారి, సర్పంచ్‌లు హైదర్, పాండునాయక్, జనార్దన్‌రెడ్డి, ద్యావరి విజయమ్మ, వీరప్ప, రమేష్, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ జితేందర్‌రెడ్డి, రుక్మాపూర్ మాజీ సర్పంచ్ రమేష్‌కుమార్, నాయకులు నరేష్‌రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కళలను పరిరక్షించుకోవాలి

తాండూరు టౌన్: ఈ నెల 6వ తేదీన వరుణ్ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. సంప్రదాయ, జానపద, పాశ్చాత్య తదితర నృత్య పోటీలను నిర్వహించడం అభినందనీయమని, కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నిర్వాహకుడు, డ్యాన్స్ మాస్టర్ గోపాల్ మాట్లాడుతూ స్థానిక ఎస్వీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో పోటీలు నిర్వహించనున్నామని, పాల్గొనదలచిన వారు 7981699774 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, డ్యాన్స్ మాస్టర్లు అశోక్, రఘు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

కార్యకర్తలే నాబలం, బలగం



తాండూరు రూరల్: కార్యకర్తలతో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: మరో ఐదు నెలల్లో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాండూరులో రాజకీయం వేడెక్కింది. బుధవారం తాండూరు మండలం గౌతపూర్ గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడారు. ఇక పట్నంలో ఉండను, ఇక నుంచి పల్లెల్లో పర్యటిస్తానని ఆయన చెప్పారు. కార్యకర్తలే నాబలం, బలగం అని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, వడ్డె శ్రీను, రాంచంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్, జనార్దన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, దస్తప్ప, లక్ష్మణ్, రాములు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ

యాలాల: రాఘవపూర్ క్రీడా మైదానంలో పట్నం రినీష్‌రెడ్డి నిర్వహించనున్న క్రికెట్ టోర్నీ ఏర్పాట్లను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పరిశీలించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కరణం పురుషోత్తం రావు, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, పార్టీ యువజన నాయకులు సిద్రాల శ్యాంప్రసాద్, అశోక్ తదితరులు ఉన్నారు.

నేడు క్రికెట్ టోర్నీ

పెద్దేముల్: గురువారం నుంచి మండల కేంద్రంలో పట్నం రినీష్‌రెడ్డి ఆధ్వర్యంలో (పీఎంఆర్) క్రికెట్ పోటీలు జరుగుతాయని బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోర్నీ స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతుందని తెలిపారు.

ఘనంగా ప్రతిష్ఠాపన పూజలు

ధారూరు: మండల కేంద్రంలో పునర్నిర్మించిన హనుమాన్ ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. గణపతి, సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలను రుత్వికులు వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న రుత్వికులు

కిడ్నీ బాధితురాలిని ఆదుకోవాలి

బంట్వారం: కిడ్నీ బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు ప్రభుత్వాన్ని కోరారు. కోట్‌పల్లి మండలం జిన్నారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సంతోష (30)కు రెండు కిడ్నీలు పాడై మంచానికే పరిమితం అయింది. విషయం తెలుసుకున్న నర్సింహులు బుధవారం బాధితురాలిని పరామర్శించి మాట్లాడారు. సంతోష కుటుంబానిది రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి అని, చికిత్స కోసం ఆమె భర్త ప్రభాకర్ ఇప్పటికే రూ.5 లక్షలకు పైగా వైద్యానికి ఖర్చు పెట్టాడని తెలిపారు. ప్రభుత్వం, దాతలు స్పందించి కిడ్నీ బాధితురాలికి వైద్యం చేయించాలని కోరారు. దాతలు 8179478437 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

3రోజుల పాటు రైల్వేగేట్ బంద్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడకు వెళ్లే మార్గంలోని ఇంద్రానగర్ వద్ద ఉన్న రైల్వేగేట్ సమీపంలో లెవల్ క్రాసింగ్, ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నెల 2నుంచి 4వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 4వ తేదీ సాయంత్రం 6గంటల వరకు మూసేస్తున్నట్లు ప్రకటించారు. కావున వాహనదారులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు

కొడంగల్: పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల విద్యార్థులు సంధ్యారాణి, సాయి సచ్చిదానంద, అద్వైత గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నరేష్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను అభినందించారు.

గ్రామాభివృద్ధికి కృషి

దోమ: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని సర్పంచ్ సుజాత అన్నారు. బుధవారం గుండాల గ్రామంలో సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దోమ బసయ్య, సీనియర్ నాయకులు జగత్‌రెడ్డి, టీపీ విరేంద్ర, పంచాయతీ కార్యదర్శి మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలి

హెచ్‌డబ్ల్యూఓ జైపాల్‌రెడ్డి

మోమిన్‌పేట: ప్రతీ ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని హెచ్‌డబ్ల్యూఓ జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం వెల్‌చాల్‌లో సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన పౌరహక్కుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సోదరభావంతో మెలగాలని సూచించారు. అంటరానితనం అమానుషమని, ప్రస్తుతం గ్రామాల్లో అలాంటి వ్యవస్థ లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జయప్రకాశ్, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సహజం

సీఐ ప్రసన్న కుమార్

శంకర్‌పల్లి: క్రీడల్లో గెలపోటములు సహజమని, క్రీడాకారులు వాటిని సమానంగా స్వీకరించాలని శంకర్‌పల్లి సీఐ ప్రసన్న కుమార్, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అన్నారు. మండల పరిధిలోని మోకిల గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో నెల రోజులుగా నిర్వహించిన వాలీబాల్-2023 వేసవి క్రీడా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మోకిల జట్టుకు రూ.12వేల నగదు, రెండవ బహుమతి కొండకల్ తండా రూ.8వేల నగదు, షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆశీర్వాదం, వార్డు సభ్యులు శేఖర్, విఠల్, ముక్రం తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ ప్రసన్న కుమార్

వేడుకల్లో ఉద్యమకారులను గౌరవించాలి

టీయూఎఫ్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దశాబ్ది ఉత్సవాల్లో ఉద్యమకారులను గౌరవించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో ఉద్యోగాలు, వ్యాపారాలు వదిలి పోరాడిన వారిన పరిస్థితి ప్రస్తుతం దారుణంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా వారిని పట్టించుకునే వారే లేరన్నారు. శుక్రవారం నుంచి నిర్వహించే ఉత్సవాల్లో ఉద్యమకారులను గౌరవిస్తూ వారికి ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

ఫీజుల దోపిడీని నియంత్రించాలి

- ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి
- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

చేవెళ్ల: ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఆయన ఆర్డీఓ వేణుమాధవ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం డివిజన్ అధ్యక్షుడు జైపాల్, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంకుగానే బోయలు

కొందుర్గు: ఎన్ని ప్రభుత్వాలు మారిన వాల్మీకి బోయల బతుకులు మారండం లేదని, తమను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని వాల్మీకి బోయ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ బాలకృష్ణ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామంలో ఇంటింటికీ వాల్మీకి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తిలేని కులం వాల్మీకి బోయలకు ముడెకరాల భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, చంద్రయ్య, కృష్ణయ్య, యాదయ్య, రామచంద్రయ్య, ఆంజనేయులు, మల్లేశ్ పాల్గొన్నారు.

2వ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయండి

ఆందోళన చేపట్టిన కాంట్రాక్టు ఉద్యోగులు

కేశంపేట: 2వ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏఎన్‌ఎంలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖకు చెందిన ప్రతీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో 2వ ఏఎన్‌ఎంలే ముందుండి పూర్తి చేస్తారన్నారు. ఎన్నో ఎళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న తమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కోరితే.. జీతాలు చాలకపోతే ఉద్యోగాలను వదులుకోవాలని చెప్పడం సరికాదని మండిపడ్డారు. వెంటనే మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2వ ఏఎన్‌ఎంలను జీఓ 16లో చేర్చి తమకు జీతాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీణ, కృష్ణవేణి, సంతోష, వాణి, గున్నమ్మ, సుజాత, హేమలత, తిరుపతమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌ఎస్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి



పరిగి: ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

- సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించాలి
- అవతరణ వేడుకల సన్నాహక సమీక్షలో ప్రజాప్రతినిధులు, అధికారులు

పరిగి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉత్సవ ఏర్పాట్లు, నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపటి నుంచి మూడు వారాల పాటు నిర్వహించే వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొనేలా చూడాలని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఉత్సవాలు ఎందుకు జరుపుతున్నాం అనే విషయం ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర ఏర్పడిన తరువాత తెలంగాణలో జరిగిన అభివృద్ధి గురించి వివరించాలని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీపీలు అరవింద్‌రావు, సత్యహరిశ్చందర్, జెడ్పీటీసీ హరిప్రియ, మేఘమాల, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, రైతుబంధు చైర్మన్ రాజేందర్, ఎంపీడీఓ శేషగిరిశర్మ ఆయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు సాగాలి..

అనంతగిరి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఈ మేరకు వికారాబాద్ పట్టణంలోని నర్సింగ్ గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులతో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. రోజువారి కార్యక్రమాలను అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, ఆర్డీఓ విజయకుమారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, డీఎల్‌పీఓ అనిత, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ అనితగౌడ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ ఆదేశించారు. ఇదిలా ఉండగా.. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలన్నా.. ప్రజాప్రతినిధులన్నా.. అధికారులకు లెక్కలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ గాడి మంజుల ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంఈఓ వెంకటయ్య, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్, కోఆప్షన్ సభ్యుడు శంషోద్దీన్, ఎంపీటీసీ, సర్పంచులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనితగౌడ్